అమ్మ స్పర్శలా..

రేపటి తరం ఆరోగ్యవంతంగా ఉండాలంటే నేడు పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతుగా ఉండాలి. అప్పుడే చక్కటి సమాజ స్థాపనకు వీలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటు పడుతోంది. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందజేయటం, వారి ఎదుగుదల, బరువు, ఎత్తులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తోంది. పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పిస్తూ చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం కృషి చేస్తోంది.

- చిన్నారులను సాకుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- ప్రతినెల బరువు, ఎత్తు పరిశీలన
- పౌష్టికాహారం అందజేస్తూ పిల్లల ఆరోగ్య రక్షణకు కృషి

అల్లిపురం : ఎదిగే పిల్లల ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. అదే బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వం పిల్లల పోషణ బాధ్యతలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపడుతోంది. పిల్లలకు ప్రతి రోజు పోషకాహారం అందజేసి వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరగటమే కాకుండా వారి మానసిక, శారీరక ఎదుగుదలకు చక్కటి చర్యలు తీసుకుంటోంది. పోషకాహారంపై చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా ప్రతి నెల చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో వారి ఎత్తు, బరువులు నమోదు చేస్తూ ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తోంది. 0 నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులకు ఒక మెనూ, 3 నుంచి 6 ఏళ్ల వయసు గల పిల్లలకు మరో మెనూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందిస్తున్నారు.



చిన్నారుల ఎత్తు కొలిపించేందుకు క్యూలో నిల్చున్న తల్లులు

ప్రతి రోజూ చిన్నారులకిచ్చే మెనూ ఇలా..

సోమవారం	అన్నం, దోసకాయ పప్పు, ఉదయం ఉడికించిన గుడ్డు–1, 100 మి.లీ. పాలు
మంగళవారం	పులిహోర, టమాటా పప్పు, ఉడికించిన గుడ్డు–1, 100 మి.లీ. పాలు
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు–1, 100 మి.లీ. పాలు
గురువారం	అన్నం, ఆకుకూర, ఉడికించిన కోడి గుడ్డు–1, 100 మి.లీ. పాలు
శుక్రవారం	అన్నం, సొరకాయ పప్పు, ఉడికించిన కోడి గుడ్డు–1, 100 మి.లీ. పాలు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర కర్రీ, ఉడికించిన కోడి గుడ్డు–1, 100 మి.లీ.పాలు



చిన్నారి బరువు తూస్తూ..

మంచి ఆహారం అందుతోంది..



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రతి రోజు మా అబ్బాయికి మంచి ఆహారం అందుతోంది. ప్రతి రోజు ఒక గుడ్డు, పాలు ఇస్తున్నారు. ఆయా చక్కగా చిన్నారులను చూసుకుంటుంది. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బాగుంది.

–కన్నూరి వరలక్ష్మి, అమ్మవారివీధి

ప్రభుత్వ సహకారం బాగుంది..



అంగన్‌వాడీ కేంద్రాల ద్వా రా బాలింతలుగా మాకు, చిన్నారులకు ప్రతి రోజు మంచి ఆహారం అందిస్తున్నారు. ప్రతి నెల పిల్లల బరువుతో పాటు వారి ఎదుగుదలను పరిశీలిస్తున్నారు. వారిలో ఎటువంటి లోపం వచ్చినా తగిన పోషకాహారం అందిస్తున్నారు. మంచి భోజనం పెడుతున్నారు.

– తుట్టు సంధ్యారాణి, అమ్మవారివీధి

మా అమ్మాయి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తున్నారు

అంగన్‌వాడీ కేంద్రం ద్వారా మా అమ్మాయి ఆరోగ్యం నిరంతరం పరిశీలనలో ఉంటుంది. ప్రతి నెల పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. వారి బరువు, శరీర దారుఢ్యం, ఆరోగ్యాన్ని పరిశీలించి తగిన పోషకాహారం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పి.ఇంద్రజ, అమ్మవారివీధి

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతులు ఇస్తున్న అర్చకులు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

స్క్రాప్ వాహనాల తొలగింపు



జనతా బజార్ వద్ద వాహనాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ : జనతా బజార్ వద్ద స్క్రాప్ వాహనాలను వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం తొలగించారు. 35వ వార్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న జనతా బజార్ వ్యాపారులు స్క్రాప్ వాహనాలను మున్సిపల్ స్టేడియంకు ఆనుకుని ఉన్న రహదారిలో పార్కింగ్ చేసుకుంటున్నారు. దీని వలన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పాత వాహనాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. అనధికార పార్కింగ్‌పై పలుమార్లు హెచ్చరించినా స్పందించడం లేదన్నారు. మరోసారి ఇలాగే పార్కింగ్ చేసే అందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. వాహనాలను పూర్తిగా తొలగించేందుకు రెండు రోజుల సమయం ఇచ్చారు.

పోలీసుల వేధింపుల నుంచి కాపాడండి

దాబాగార్డెన్స్: కుటుంబంలోని వివాదాల కారణంగా తమకు న్యాయం చేయమని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. కనీసం తాము ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకుండా పోలీసులు తిరిగి కేసులు నమోదు చేయడం అన్యాయమని బాధితుడు దువ్వాడ నాగరాజు వాపోయాడు. తనకు జరిగిన అన్యాయాన్ని మీడియాకు ఆదివారం తెలిపాడు. సింధియా స్క్వాలనీ చింతలవాని గ్రామంలో 40 ఏళ్లుగా నివసిస్తున్నానని, కుటుంబంలో తాతయ్య, మేనత్తల మధ్య నెలకొన్న భూ వివాదాల కారణంగా తనను తన తండ్రి నిర్మించిన ఇంటి నుంచి బయటకు పంపించేశారంటూ భార్యతో కలిసి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిని కనీసం పోలీసులు పట్టించుకోకుండా తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్, ఎస్ఐ దేవుడమ్మ, సీఐ దేవుడుబాబు ఇష్టానుసారంగా తనను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు. తనకు జరిగిన అన్యాయంపై గత ఏప్రిల్ 19న స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఆ ఫిర్యాదును పట్టించుకోకుండా పదే పదే స్టేషన్‌కు పిలుస్తూ తనపై తప్పుడు కేసులు బనాయించారంటూ బాధితుడు ఆరోపించాడు. తాను సీనియర్ న్యాయవాది చరపల్లి సత్యారావు వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ఆయనతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'కోలా'కు అభినందనలు



కోలా గురువులును అభినందిస్తున్న అల్లిపల్లి ఎల్లాజీ

దాబాగార్డెన్స్ : డీసీసీబీ చైర్మన్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ ఆదివారం సంఘ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కోలాతో చర్చించారు. సంఘ సభ్యులు పేర్ల ధనలక్ష్మి, ఎస్. శంకర్, ఎన్. చింటుకుమార్, పి. రాజు, ఎం. సత్తిరాజులు పాల్గొన్నారు.

ఘనంగా బీవీకే కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార : దొండపర్తి సమీపంలోని ఒక హోటల్లో బీవీకే కళాశాల సిల్వర్ జూబ్లీ అల్యూమినా మీట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1993 నుంచి 1998 వరకు కళాశాలలో చదివిన విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు చేద్దామని వారంతా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

కల్వర్టుకు మరమ్మతు చేయాలి



వెలంపేట వద్ద శిథిలమైన కల్వర్టు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద ఓ కల్వర్టు శిథిలమయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టుపై సిమెంట్ పలక కల్వర్టులోకి కూరుకుపోవడంతో పెద్ద గొయ్యిగా ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా వర్షం నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. ఇళ్లలోకి నీరు చేరిపోయి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే సిమెంట్ పలక వేసి గొయ్యిని పూడ్చాలని వెలంపేట వాసులు కోరుతున్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



1981 బ్యాచ్ జూనియర్ కళాశాల విద్యార్థులు

సీతమ్మధార : వారంతా 42 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83లో ఇంటర్ చదివిన విద్యార్థులు వారంతా. విశాఖపట్నంలోని డైమండ్ పార్కు దరి ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గోపీనాథపురం స్కూల్, కళాశాలలో చదువుకున్న పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో తెలుసుకున్నారు.

మహిళలు థింసా నృత్యం, మగవారు స్టెప్పులతో అదరగొట్టారు. ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రతాప్, సాలూరు మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు, కేజీహెచ్ హెడ్ నర్సు లక్ష్మి, ఎంవీడీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ బమ్మిడి రమణి, హెల్త్ డిపార్టుమెంట్‌కు చెందిన డి.రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు, బ్యాట్మింటన్ క్రీడాకారుడు ఆర్‌వీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



అబుసరంగ వీధిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. ఆదివారం వార్డులో కోటవీధి, ఫెర్రీవీధి, అబుసరంగా వీధుల్లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై కూడా ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే వెంటనే తెలియపరచాలన్నారు. సంబంధిత సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి వారికి పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిగిలిపోయిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే వార్డులో సీసీరోడ్లు, వీధిలైట్లు, కాలువలు, బీటీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్య కల్పన వంటివి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్ : విద్యుత్ ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించింది. సిటు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు యూనియన్ల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఏపీ విద్యుత్ సంస్థలో ఉద్యోగులు/కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం, విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, పీస్‌రేట్, కార్మికుల ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి ఈ నెల 26న విజయవాడలో వేలాది మందితో నిర్వహించిన రాష్ట్ర సదస్సు విజయవంతమైందన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ ఆందోళనలకు, పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని, విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో తీర్మానించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 10 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్. సత్యారావు, వేపాడ సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్‌కే రెహ్మాన్, సాయి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలో ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో మనం నిత్యం చూసే ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత ఉందని ఏయూ వృక్షశాస్త్ర విభాగ పరిశోధకుడు డాక్టర్ ప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం విభాగంలో నిర్వహించిన మొక్కలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశీయంగా పెరిగే మొక్కలు, విదేశాల నుంచి తెచ్చి అభివృద్ధి చేసిన మొక్కలు, ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగంలో మ్యూజియంలో భద్రపరిచిన వివిధ మొక్కల ప్రత్యేకతలు, విశిష్టతలను ఆయన వివరించారు.

గౌతు లచ్చన్న స్మారక భవనం ఏర్పాటుకు వినతి



ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీశయన కులస్తులు

దాబాగార్డెన్స్ : బీసీల పక్షపాతి గౌతులచ్చన పేరిట విశాఖలో స్మారక భవనం ఏర్పాటు చేయాలని విశాఖ శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీశయన కులస్తులు ఏ సమస్య వచ్చినా సంఘం తరపున చెప్పుకోవడానికి విశాఖలో ఎటువంటి సామాజిక భవనం లేనందున కులస్థులందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన శ్రీశయన కులస్థుల సంక్షేమానికి కృషి చేయాలని, వివాహ వేడుకలు నిర్వహించుకునేందుకు 50 సెంట్ల భూమి కేటాయించేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీశయన సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఈడీ



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఈడీ రవికుమార్

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం సాయంత్రం ఏపీఎస్ ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సందర్శించారు. బస్‌స్టేషన్‌లో స్టాల్స్, పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పార్సిల్ పాయింట్‌ను ప్రయాణికులు, వ్యాపారస్తులు, సింహాచలం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పార్సిళ్లు జాగ్రత్తగా తీసుకు వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే క్రాస్ రోడ్డులో పార్సిల్ పాయింట్ బుకింగ్ అండ్ డెలివరీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తులసి, కొండలరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రచయిత విహారితో సాహితీ గోష్ఠి

సీతంపేట: కవి, కథా రచయిత విహారితో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాహితీ గోష్ఠి జరిగింది. విశాఖ సాహితి సంస్థ అధ్యక్షులు ఆచార్య మలయవాసిని అధ్యక్షత వహించారు. రావిశాస్త్రి పురస్కారం అందుకోనున్న విహారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహారి కథకుడిగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలందించారని ప్రశంసించారు. సాహిత్య గోష్ఠిలో పలువురు అడిగిన ప్రశ్నలకు విహారి సమాధానాలు చెప్పారు. కథా రచనలో మెళుకువలు, కథన శిల్పంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చారిత్రక, పౌరాణిక నవలలు రాయడంలో ఉండే ఇబ్బందులను విశ్లేషించారు. ఎవరు ఏ వాదంతో రాసిన మానవతా వాదం అన్నింటి కంటే గొప్పదని పేర్కొన్నారు. రచయిత సమాజ పోకడలను అర్థం చేసుకుని ప్రాచీన సాహిత్యాన్ని ఇప్పటి వాదాలతో పరిశీలించకూడదన్నారు. గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి, రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సంప్రదాయ, అభ్యుదయ మార్గాలకు వారధిగా విహారిని అభివర్ణించారు. అనంతరం విహారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, జె.పి.శర్మ, కందాళ కనకమహాలక్ష్మి, శంకర్ నీలు, బులుసు సరోజిని, గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకుడికి జ్ఞాపిక అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

మహారాణిపేట : ఆది లీలా ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త నిర్వహణలో ఆదివారం రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్, గ్యాస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్, ఆలిండియా ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయాలని అన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో చైతన్యం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాంటీ కరప్షన్ ప్రెసిడెంట్ రాజిక్, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాసరావు, సెక్రెటరీ ఎ. శ్రీకాంత్, కన్వీనర్ ఎం, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కార్గిల్ విజయ్ దివస్, స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ ఇన్చార్జి సర్వీస్ రంగనాయకులు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ భారతమ్మ, రెడ్ క్రాస్ పీఆర్‌వో రావు తదితరులు పాల్గొన్నారు.

గురిపెడితే.. తప్పకూడదు..



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి

ఏయూ క్యాంపస్: దేశ రక్షణలో యువత అడుగిడాలి. భరతమాత రక్షణకు నడుంబిగించాలి. యువతీ యువకులు దేశ త్రివిధ దళాలలో చేరాలి. దీనికి తొలి అడుగుగా నేషనల్ కేడెట్ కార్ప్స్ నిలుస్తుంది. కళాశాల స్థాయిలో విద్యార్థులను ఎన్‌సీసీలో భాగస్వాములను చేస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, యుద్ధ మెలకువలు నేర్పిస్తారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ అవుట్‌గేట్ వద్ద ప్రతి ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలా ఈ ఆదివారం కూడా విద్యార్థులకు తుపాకీల వినియోగంపై ఎన్‌సీసీ అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నమూనా తుపాకులు అందించి ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు.

ఆశావాద దృక్పథంతో సాగాలి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆశావాద దృక్పథంతో అడుగేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సూచించారు. ఆదివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మికత వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్నారు. లివింగ్ హనుమాన్ పుస్తక రచయిత డాక్టర్ పవనకుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక భావాలు, మేధస్సును కలిగి ఉంటూ కర్మయోగిగా మారాలని సూచించారు. పవన్ కుమార్ మిశ్రాను స్పిరిచ్యువల్ సైంటిస్ట్ అవార్డుతో సత్కరించారు. అభిషేక్ రచించిన లార్డ్ హనుమాన్–రామ్‌కుక్కురా పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వేదాంత ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బి.వి.కె.చైతన్య పాల్గొన్నారు.